# కోడలమ్మ ఎతలు

అయ్యో ! భగువంతుడా ! ఏంసిచ్చువెడ్తివిరా ? తండ్రీ ! కోడిబత్కోలె దిన దిన గండంగ గడుస్తుండది నా బత్కు. పదేండ్ల నుండి ఈకొంపల కాపిరం జేస్తుండనా ? అయినగని ఈ యింటి కోయిల్లాలిని గాను దొంతి కో గుర్గిని గాను అన్నట్లుండది నా కాపిరం.

మా అత్తకండ్లల్ల నేను వో ఈగెను, దోమనుగాను, కాకుంటెవోతి, అప్పుడె తాళపుసెవుల గుత్తిదీస్కోని నడ్మల జెక్కుకుంట నంటిగిటన ? యాదిలేదు, వుత్తపు న్యానికె నన్నుపాలల్ల వడ్డ ఈగను దీసేసి నట్ల తీసేస్తది. ఏస్తెవాయె, నాతావున నేను వుంటనన్న నన్ను వుండనిస్తద ? అంటే అదీలేదు,

గండకత్తెర్ల సొప్పదంటోలెనలిగి నజ్జిగిజ్జి అయితుండనంటె నమ్మండి. కూసుంటె తప్పు .లేస్తెతప్పు. అయ్యోదేవుడా ! కూసున్కం, లేస్కం, అట్లవెట్టి, నానెత్తి నేను దువ్వుకున్నాతప్పే ! దువ్వుకోకుంటె అంత కన్న తప్పు ! తుమ్మిన తప్పే దగ్గిన తప్పే !

తుమ్ములు, దగ్గులు నన్నడిగి వొస్తయి గన్కనా ? ఆగవట్టుకునెటందుకు ? పొద్దున్నె సుక్కవొడుంగ లేసి సద్దకంకి గొట్టంగ ఆ బూజులకు ముక్కుగుల గుల వెట్టంగ ఒక్కటి రొండు మాట్లు తుమ్మిన, అది జూసి మా అత్తదొర్సాని ఆయ్యోపాపం, అనక-''మాకోడలమ్మ యా శుభకార్యం దలపెట్టినగని కచ్చు,కచ్చున తుమ్ముడే లెక్క'' ''సుభం గోరుర పెండ్లికొడ్క అంటె ఐరేని కుండ పర్రె'' అన్నడంట అంట పురాణం జదివె.

ఇంగప్పై అలిసి ఆవులిచ్చిన అనుకో ! మా అత్త గిన జూసిందంటె 'అదేందే ? శారదమ్మ ! గూట్లె దీపెం నూట్లె బుక్క'' అంట అప్పెడె దిని మంచం ఎక్కుతనంటవ ? ఎట్ల ? అంట దిడ్డి తల్పులు దబ్బ దబ్బగొట్టె.

మొన్నఏమైందనుకున్నరు? పొద్దుందాంక వొంచిన నడుమ్మ ఎత్తకుండ గుమ్మిలకెల్లి గింజలు తోడి ప్రాణం పుల్ల సిల్లినట్ల అలసిపోంగ కాళ్లు జేతులు గడుక్కున్న గని నెత్తికి నూనె వెట్టుకోని దవ్వుకోలేదు, ఆ ఏశంతోటె మా ఆయిన విలిస్తె పోయిన-

ఇదిజూసి మాయత్త దోసయ్యమంత్రాలు సదివినట్ల సదువుకుంట ఏందో? వాణి రాత! పొద్దున అనంగ నోట్ల రొండు మెతుకులు గుక్కుకోని పోతె సీకటి వడంగ కాళ్లీడ్సుకుంట యింటికొస్తడు గద? కొడుకు! అసొంటప్పుడు వాడు ఇంటికి రాంగనె ముద్దుగ స్తానం జేసి జెడేస్కోని పూలు సింగారిచ్చుకోని యింట్ల పెండ్లాం ఆడ్తి, కళ కళ లాడుకుంట కండ్ల వడ్తద? లేకుంటె మా తల్లి కోడలమ్మ తీర్గ, నెత్తింత బట్టింత అని మాడ్పు మూతివెట్టుకోని తీసేసిన బోలె తీర్గవుంటాది? నాయమ్మ ఎట్ల వుట్టిందో? గని మొకాన ఎప్పుడు పాడేకొట్లాడ్తది అంట కొడుక్కు యినిపిచ్చెటట్ల లాజిగ లొల్లివెట్టె.

అవన్ని యినిగుడ నన్నుగాదన్నట్ల, నాకు యినవడనట్ల మా ఆయినతోటి నగుకుంట ముర్సుకుంటనె వున్న.

సీకటివడ్తుండ దనంగనె మావూళ్ల పట్కారి బాలమ్మ యింట్ల వళ్ళినన్ని మల్లె పూలు ఇంగ ఆమె అ పూలను దండలు గట్టి ఇంటింటికి దిర్గి అమ్ముతది. కొనుక్కో బుద్ధి అయినగని మాఅత్తమ్మ బయానికి దైర్నం జేసి కొనుక్కోలేదు, గని మొన్నత్యాప అట్లన్నదని, వోరొండు పైసలు వెట్టి పూలచెండు గొనుక్కోని జెడల వెట్టుకోని జెడ యాళ్లాడేసుకున్న-

ఎంత, యిసం, నింపుకున్నదొ? పుణ్యాత్కురాలు. తెల్లారగట్ల లేసి అవుతలి యివుతలికి నడ్సినంక దిడ్డిదాంకవోయి పక్కింటి రాదమ్మ అత్తను విల్సి, ఆముచ్చెట యీముచ్చెట వెట్టి ఆఖరికి కోడండ్ల కాడ్కివచ్చిరి. వొస్తెవొచ్చిరి, తిట్టిఆడిపోసుకున్న సరెగని, తనను అడ్గకుండ పూలు గొనుక్కున్న సంగతి తనను ఇంగాపాడుస్తున్నట్ల గాంగ ఇప్పటికాలాన్ని తిట్టుకుంట ''రాదమ్మా! ఏంకాలం తల్లి? కలికాలం! వొపెద్దంటలేదు; వోసిన్న అంట లేదు, ఎవ్వరికి వాళ్లదె పెద్దిర్కం. కోడండ్లు రాజ్యం ఏలంగ అత్తగుడ్డిగవ్వొలె పెట్టిందితిని, పోసింది తాగి మూలకు, నత్కె కాలం అంట దిట్టె. తిడ్తెతిట్టె దినాం వున్న కొల్పెగద! అంట వూకుంటె, ఇంట్ల కొచ్చి తావుసం బట్టలేక నన్ను పేరు వెట్టి విల్సుకుంట-

'నేను వుట్టి యింత దాన్నైన్నా? యిసొంటి యిచిత్రాలు యాడ జూడలేదు; ఎన్న

డు గా(నాలేదు. ఈ యిల్లు సంసారికొంప. ఇంట్ల కోడలమ్మలు, ఏశకాంతలోలె జెడలు యాళ్లాడేస్కోని తిర్గుతుంటె ఇర్గుపొర్గు ఏమనాలె ? అత్తలు కండ్లు మూస్కుంటె కోడండ్లు ఆడింది ఆట, పాడింది పాటగాదా? అంట నన్నంటరు తల్లీ !' అంట దీర్గాలు దీసె,

అంటె అనె అనిదుల్పుకతిర్గుతుంటె, 'శారదమ్మ ! నేను అంతగానం నెత్తిన నోరు వెట్టుకోని చెప్తుంటె నీ చెవు మీద పేను అన్న వారినట్ల లేదు, పురాగ, 'ధూ' అంటె 'భలా' అంట దిర్గుతుండవ్, గసొంటిటక్కాయ్ శాస్త్రలు జేస్కుంట, మిడ్తోలె ఆడుకుంట, వాణ్ణి పురాగ క(రెకుక్కను జేసిఎంటదిప్పుకుంటుండవు. అట్ల గుడ్లప్పగిచ్చి సూడకు మర్నాగి' అంట నోటికి వొచ్చిన మాటలనె.

ఇంగ మొన్న పండుగనాడు ఆయన ఇంట్లనెవుండి ఏందో పనిమీద నన్ను విల్సిండు, పిల్సిండు గద? అంట అరలకు వోయిన, అదొచ్చింది తప్పు, నాకొచ్చింది ముప్పు. నేను అరదాటి వొచ్చినంక వారగండ్లనన్ను జూసుకుంట, వు(గంబట్టలేక ''నడుం గల్లె పనిడ్సి అరలకు వుర్కొటంత అర్జెంట్ పనేమొచ్చె ? 'అత్త ! నీకొడ్కుకుఏంగావల్నో ? జెరజూడు ! అంటె నేను పోకపోదునా? సిన్ననాటిగోలె నీవె సాదిసంతరిచ్చినవ? అయ్యొ కతా ! మొగుడు పెండ్లాలంట యాడలేరు సూడు? భూమ్మీద, మాయింట్లనె వుండరు. ఇంత అన్యాలం యాడ జూడ లేదు.

నాపెండ్లైయింతదాన్నె, ఇందర్నిగంటిగద ? ఒక్కనాడన్న మాఅత్త మామల ముం గల మా ఆయినను కన్నెత్తిసూస్తెవొట్టు ! ఇదెక్కడి దొమ్మరి సట్టమో ? మరెంటెమరి ! పెండ్లి నాడేసిన (బహ్మముళ్లు యిడ్వకుండ వొగరి ఎంట ఒగరు దిర్గితె ఎట్ల'' అంట బీర కాయపసరంత గడ్గిపోసె.

ఇంగమొన్నత్యాప పండుగనాడేమొ ఇంట్లనే వున్న మాఆయిన ఏందో పనివడి నన్ను విల్సిండు, పిల్సినగని మొన్ననె అన్నిమాటలు వడ్తి మాటలు వడుడేంది ? నాకు వట్టిన ద్యావరపోదులిపితె ? గట్లని మాఆయిన పిలుపు యినవడ్డగుడ యిననట్ల గుడ్ల నీళ్లు గుక్కుకుంట జాలట్ల బియ్యం గాలిచ్చుకుంట గూసుంటి. అట్ల గూసున్న నాకాడ్కి మా అత్త శిగమూగినట్ల వుర్కొచ్చి''ఏమే ! శారద ఎవర్ని రద్ది వెడ్తమని ? అంత అత్తమాట పొంటే నడుస్తుండవ ?నాంచారి ! వొగలాడితనం గాకుంటె ? పాపం ! మొగణితోటి పిల్లను అత్త మాట్లాడనిస్తలేదని వాణి మనుసుల ఏతం అనేగద ? నీ శమత్కారం అంత ! లేకపోతె అవుతల మొగడు, కుత్కొవడెటట్ల పిలుస్తుంటె హరీ ! శివ అనకుండ బెల్లం గొట్టి

న రాయితీర్గ గూసుంటవా? ఎట్ల ? యివన్ని బయం బుగులు లేని నడ్కాలు గావ? ఏంది ? అంట కొడుక్కు పురి ఎక్కిచ్చె. ఒక్కటని వడ్తన ? రొండని వడ్తన ?

అయ్యో ! చెప్పమర్శిన, మొన్న పెత్తరమాస దాటినంక మా అత్త అన్నకొడ్కు వోపూట సూసిపోదమంట వొచ్చిండు; ఎట్లన్న దగ్గరొడాయె, ఏందన్నపుల్గంగిన వొండ మంటదో ? ఏందో ? అని మెల్లగ దగ్గరికి వోయి అత్తమ్మ ! ఈయాల్ల వంట ఏం జేయాలె ? బియ్యం ఎన్నివోతు ? అంట అడ్గిన, అట్ల అడ్గెట్యాల్లకు ఆమె ఏం కోపమో ? ఏందొ ? గని ''అయ్యొ ! కోడలమ్మ ! సదివేస్తె వున్నమతి వోయిందంట, ఇంగసిన్నపిల్లవు ఎన్నలు వెట్టినా మింగవు, మణుసులను జూసి పొయ్యాలంట దెల్వద ? తలాపావెడు సొప్పున పొయ్యరాద? అంట అన్నది వూకుండెన ? వూఁహు లేదు, బిర బిర వొచ్చి కోడుగుడ్ల అంటువులివెట్టి, పూరీలు గాల్సి, పాలపరువాన్నం వొండు అంట జెప్పిపాయె.

'సరె ! ఆమెకు నాకు యిద్దరికి అలువాటైన ముచ్చెటకు సాగదీసుడు ఎందుకు ? అంట వూకుంటి.

అయితె మొన్న బత్కమ్మ పండుగకు దోల్కపోతనని నాసిన్నతమ్ముడు వొచ్చిండు, 'అక్క' అంట యిల్లు జొచ్చుకొస్తె వుత్తబువ్వ బెట్టి తోల్తె ఎట్లుంటదని కైమ వుంటలు జేసి, కొబ్బరేసి బెల్లప్పొంగలి జేసిన - తినుడేమొ అందరు గల్సి కమ్మగ, పుల్లగ అనుకుంట బాగనె దిన్నరు గని మా అత్త అటెంక తన, హుకుంలేంది వొంటుకంజే సిన్నని, గుర్రున జూసుకుంట, పిల్లిమీదకాకిమీద ఏసి తిట్టుకుంట, ఎవర్నొ అంటున్నట్ల 'ఇండ్లల్ల దినాం పండుగలు జేసుకుంట, అస్సొలుగాల్సుకుంట వొచ్చి పొయ్యెటోల్లకు వొడ్డిచ్చుకుంట గూసుంటె ఆయింట్ల ఏంకాపాయం వుంటది ? కపాయం అట్లవెట్టి ఇల్లు జలగడిగినట్ల గాంగ ఎల్లమ్మ యిల్లలికి నట్లె అయితదికాపిరం. సూడబుద్ధిగాదు తల్లి ఈవుల్లఖర్చులు. ఇదొ ? కాపిరమా ? యాది పాతంగ,పొందికంగ వుండదని కాపిరంల బర్కత్‌వుంటది. కంట్లవొత్తేస్కోని పదిదిక్కులకెల్లి జూస్తుంటెనె యిట్ల ఎలుగుతుండది మాయిల్లు, నేను వోయిన్నాడు దెలుస్తది, తెల్సుడేంది? యిసొంటి ఆడిది మొగణికి చిప్ప చేతికిస్తది' అంట సదువు కుంట వుండి కొడుకు రాంగనె గప్పుగ ఐంది.ఎందుకంటె ? నేను వొండిన వంటకం గుడ ఆమె కొడ్కును అడిగేచేసిన.

ఇంగ ఇట్లె ఎండకాలం పనుల యిడువాటైనప్పుడు, యిరుగు పొరుగు, నా తోటోళ్లు, నాజతగాళ్లు అంత గల్లి మాయింటికి వొస్తరనకొ, అసొంటప్పుడు మేమంత

ఆయీముచ్చెట్లు వెట్టుకుంట, బారకట్టనో ?, వూపిరిగింజలో. వానగుంతలో ? యాదో వో ఆట ఆడుకుంట గలగలమని నగుకుంట వుంట మన్కొ, అసొంటప్పుడు మా అత్త గిన జూసెనంటె ఆయిపాయె ఆమెకేందొ ? వోర్వలేనితనం, ఆకసి వట్టలేక ఏందో ? పని వున్నట్ల ఆణ్ణె మెసులుకుంట, నడ్మ నడ్మ నన్ను విలుసకుంట, నా దోస్తులకు యినిపిచ్చె టట్ల-

'శారదమ్మ ! ముందే నీ గొంతు గోలెమంత వుండది, అందుట్ల ఎవరన్న వొచ్చి నప్పుడు వాలాయించి లొట్టిమీది కాకోలె కవ్వర కవ్వర వొర్లుకం నీకు అలువాటు, యివు తల అత్తవొక్కతి, ఏందన్న పని వుంటదొ ? ఏందో ? అనే సోయి గూడ లేకుండ అన్ని మర్సి,మొగోడు యిస్పేట్ ఆటల మునిగి నట్ల గూసుంటె ఎట్ల ? అంట దుల్పుతుంటె,

పాపం ! నా దోస్తులు శారద 'పోయివొస్తమె' అంట మొకాలు చిన్నగ జేస్కొని పోయిరి.

తెల్లారి వాళ్ల అంటె ? మాఅత్త మ్యానత్త బిడ్డ వొస్తె, వొచ్చి నామెకు కాళ్లు కడు క్కొను నీళ్లిచ్చి తుడ్సుకోను తువ్వాలు అందిచ్చి, పీటేసి వొడ్డన జేసిన, ఆమెది గుడ నా ఈడెగన్క ఆపిల్ల పాపం నాతోన పరాశ్కంగ మాట్లాడిన గని అత్త, తిడ్తదేమో ? అని ముక్తసరిగనె వున్న. ఇట్ల ఆమె రొండు దినాలు ముద్దుగ కలిసి మెల్సి వుండి పోత పోత నాకో పొడరు డబ్బగుడ యిచ్చిపోయింది.

ఆమె వోయినంక మా అత్తనన్ను జూస్కుంట 'శారదమ్మ! నీ కడ్పుల ఇంత యిషం వుండదనుకోలేదు. ఇంత కపుట వాజితనమా ? అవ్వ ! చెప్పుకుంటె సిగ్గవోత ది. మా పిల్ల వున్న రొండు దినాలు మూతిని పట్టుదారంబెట్టి కుట్టేసుకున్నట్ల గుండుగ బిగిచ్చుక కూసుంటివి. నగితె ముత్యాలు రాలంగ కొంచవొయి దొంతుల్ల నింపుకుంటుం డెన ? ఏంది ? అంట పురాణం జదివె.

ఒక్కటి అంట జెప్పుదున ? రొండుంటన? అఁ మర్సిన గీరొండు ముచ్చెట్లు యినుండి.

మొన్నవోమొండి పక్కీరోడు వొచ్చిండు. వాడు ముందే మొండి పక్కీరోడు చేతికి దగిలిచ్చుకున్న రాగి కడేనికి తాళం ఏసినట్ల వోబెత్తెడు ఇనుకఁరును గొట్టుకుంట వొర్లుతుండడు, ఈ సప్పుడు ఇన్నగని, నేను పకీరు చిప్పల బిచ్చంగిన ఏస్తె యాడ మళ్ల రాశకారం? తనను అడ్డందివెడ్తె ? పెద్దీర్కం నా కెందుకంట యిననట్ల వొంటింట్ల

మెసులుకుంటనెవుండ, అదిజూసి నాసంగతి గ్రహిచ్చి, తప్పుదొర్కిందని కుశాలుగ యివు తలికి వొచ్చి దోసిలి నిండ పాతం జేసిన బియ్యం వాణి కండ్లు జెగ్గుమనెటట్ల గుమ్మరిచ్చె, గుమ్మరిస్తెగుమ్మరిచ్చె, ఆమెయిల్లు, ఆమెసొమ్ము, ఆమెసొసంత్రం, నడుంగల నాకెందు కంట వూకుంటి, మరి తాను వూకుండెన ? లేదు,

ఆపకీరోడు ఇట్ల కడ్పదాటిండా ? లేదా? కొట్టింట్లకెళ్లి యివుతలకి వొచ్చి 'శారదమ్మ ! యిదేం ? పిశునాశి గుణం తల్లి ? బిజినె తనమంటె ? యింతన ? మరీ ఎంగిలి చేత కాకిని గొట్టనంటవ్ ఎట్ల ? కనిపెంచెదానవ్ గద? కడ్పుల ఎంత ఆరివారం వుండాలె ! ఏందొ నోము వట్టినట్ల చిత్తారి బొమ్మొలె నిలవడ్తె ఎట్ల ? పేరు వోయిన కుటింబం తల్లి మాది, తప్పాలకు మెతుకు అంట కుండ అంట నియ్యకుండ గీక్కతినె బాపతుగాదు, నీమామ పేరువోయిన మనిషి, అందర్ని ఆదుకోని కడ్పులవెట్టుక పోయిండు, ఆ పుణ్యమె నాకొడ్కుకు వొచ్చింది'' అంట, చెప్పకపోతుంటె, నిజంగనె నాకు బుద్ధిజెప్పుతుండదేమొ ? ఈత్యాప బిచ్చెగాడు గిన వొస్తె వుత్తసేత తోలను అంట అను కోని , 'అత్తయ్య ! నాదితప్పె ! అని నగుకుంట అవుతలికి నడిస్తి.

ఈ కత జరిగిన మర్నాడె వో బిచ్చగత్తె జోలెల వో సంటి విల్లను కూసోవెట్టుకోని వో సేత ఈత సాప అల్లుకుంట, బిచ్చెం ఎయ్యితల్లే ! అంట వొర్లుతుండది. అదివూకె వొర్లుతలేదు, పాటగుడ పాడుతుండది. మాయత్త అప్పుడె తిని ఇట్లనడుం వాల్సింది. జెర కూర్కుగుడ వట్టిండొచ్చు; యీ బిచ్చెగిత్తిలొల్లికి యాడ లేస్తదొ? అంట దబ దబ వోయి వోసారెడు వొడ్లుదెచ్చి దానికొంగుల వోసిన, ఆ కొంగుల గింజలను అది ఇంగ ముల్లెగట్టుకోనె లేదు, ఇట్ల మర్లుతుండది,

అంతట్లకె మాయత్త కండ్లు నల్పుకుంట లేసివొచ్చి , అదియాడ కడ్పదాడ్తదో ? అన్నంత ఆత్రంగ దాన్ని ఆపి ''అసే! బిచ్చగిత్తి ! మీరు పురాగ తెగవడ్డరేందే ? పనిపొద్దున బిచ్చాని కంట వొచ్చి పొదిగేసిన కోడిపెట్టల జవురుకపోదమంట వొచ్చినావె ? వొచ్చిందాన వు వూకె వోక ఏనిగెఅంత అత్తవుండంగ కోడలమ్మ బిచ్చెం ఏస్తె కొంగువడ్తావె ! నీ సిగ్గ సిబ్బుల ఏయ, తే ! ఆ బియ్యంగింజలు అంట దానికొంగు గుంజి ఏసిన గింజలు దుల్పు కునె. తీసుకున్న బిచ్చెగిత్తె, బిచ్చెం బెట్టిన నేను నోట మాటరాక డింగై నిలవడ్తిమి.

ఇట్ల ఇంటికి ఆరబైండ్లోడొచ్చిన, అడుక్కతినెటోడొచ్చిన, సుట్టమొచ్చిన, పక్క మొచ్చిన, పగోడొచ్చిన, పాలోడొచ్చిన, యిదేవొర్స. అంతెందుకు ? నగిన, ముర్సిన,

చేసిన, చేయకున్న, తిన్న, తినకున్న, అన్ని తప్పులె, ఆమెగీసిన గీత కలల గూడ దాట గూడదు- అదివొప్పైన,తప్పైన, అదిసుగ్రీవుల ఆజ్ఞ.

ఆయింట్ల యాదానికి ఎర్తిలేదు అయినగని అడుక్కొత్తుల పోకచెక్క తీర్గ అయింది నాబత్కు. యాదితోస్తలేదు, మా ఆయనకు గూడ జెప్పను, మరి యీ ఎతను ఎళ్లవోసు కునుడు ఎట్ల? అంట మీకు జెప్తుండ.ఎదలకుంపటి ఎళ్లవోస్తె జర అల్కనయి తది, సల్లవడ్తది. ఇనగలదు తల్లి ? ఇంటె ? - ఇంగేమున్నవుంటాది ?

ఇంతకు ఆయిన మంచోడు గన్క అన్ని మర్సి సుకంగనె వుంటుండ- చెప్పిందని ఏం అనుకోకుండి, దీవిచ్చుండి.